క్లుప్తంగా

అధికారులతో సమీక్ష

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి బుధవారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు సమీక్ష నిర్వహించారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో జీవీఎంసీ జోన్–3 కమిషనర్ విజయలక్ష్మి, ఇంజినీరింగ్ అధికారులు శ్రీనివాస్, ఏఈ శ్రీరామ్మూర్తి, ఇతర అధికారులతో మాట్లాడారు. నియోజకవర్గంలో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన సూచించారు. కొత్త పనులపై అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో ఎక్కడా కూడా అభివృద్ధి పనులు ఆగకూడదన్నారు.

బోరు ప్రారంభం



బోరు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అల్ల లీలావతి

తాటిచెట్లపాలెం: దొండపర్తి ఎరుకుమాంబ ఆలయం సమీపంలో జీవీఎంసీ నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన బోరును బుధవారం 42వ వార్డు కార్పొరేటర్ అల్ల లీలావతి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ ప్రాంతంలో నీటి సమస్య గురించి కార్పొరేటర్‌కు స్థానికులు వివరించగా.. స్పందించిన ఆమె జీవీఎంసీ అధికారులతో మాట్లాడి బోరు మంజూరు చేయించారు. కార్యక్రమంలో స్థానికులు, పార్టీ వార్డు నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీ



విజేతలతో క్విజ్ మాస్టర్ సూర్యారావు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు గ్రంథాలయ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం క్విజ్ పోటీ నిర్వహించారు. 60 మంది విద్యార్థులు ఎనిమిది గ్రూపులుగా ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ పోటీ పరీక్షలకు అవసరమైన వర్తమాన అంశాలు, చరిత్ర, సాంకేతిక, విజ్ఞానం, ఆర్థిక, రాజనీతి, భూగోళ శాస్త్రాలు మొదలైన విషయాలపై 60 ప్రశ్నలు అడిగారు. గ్రంథాలయ సహ కార్యదర్శి డి.వి.సూర్యారావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. విజేతలకు పుస్తకాలు బహుమతిగా అందజేశారు. పోటీ పరీక్షలకు వెళ్లే తమ సామర్థ్యాలు తెలుసుకోవడానికి ఇటువంటి క్విజ్ పోటీలు దోహదపడతాయని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

జనరల్ నోటీసు

నా క్లయింటు అయిన Indian Bank వారు మరియు శ్రీ కలిదిండి రామకృష్ణరాజు, S/o. లేటు కె.ఎ.ఎల్. వర్మగారు D.No. 39-33-63 మాధవధార గ్రామం, విశాఖపట్నం వారు యిచ్చిన బోగట్టాపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా..

నా క్లయింటు ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని ఆయన అవసరముల నిమిత్తం Indian Bank లో Mortgage చేయుటకు Bank వారిని సంప్రదించియున్నారు. సదరు రామకృష్ణగారు సదరు ఆస్తిని శ్రీ కొంపెల్ల వెంకట కృష్ణ రవి ప్రసాదు గారి G.P.A Holder అయిన M/s. Sree Sai Siddi Developers వారి వద్ద నుండి దాక్యుమెంటు నెం. 446/2015రుగా కొనుగోలు చేసియుంటిరి. సదరు కొంపెల్ల వెంకట కృష్ణ రవి ప్రసాదు గారు సదరు ఆస్తిని దాక్యుమెంటు నెం. 1259/1992 రుగా Visakhapatnam Urban Development Authority వారి వద్ద నుండి కొనుగోలు చేసియుంటిరి. కాని సదరు దాక్యుమెంటు 1259/1992 పోయినదనియు, ఏవిధమైన అన్యాక్రాంతములు చేయలేదనియు తెలియచేయుచున్నారు. కావున ఆ దాక్యుమెంటు విషయము, ఆస్తి విషయము ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్ననూ ఈ క్రింది చిరునామాకు ఏడు దినములలోగా తెలియపర్చ వలెను. అట్లు కానియెడల ఎవరికి ఎటువంటి అభ్యంతరములు లేవని భావించి Indian Bank వారు సదరు శ్రీ కలిదిండి రామకృష్ణరాజు గారికి Loan గ్రాంటు చేయుదురు. గడువు తీరిన తరువాత వచ్చు అభ్యంతరములు పరిశీలింపబడవు.

షెడ్యూలు

గ్రేటరు విశాఖపట్నం పరిధిలో గల మాధవధార గ్రామంలో గల సర్వే నెం. 6/8లో గల కొంపెల్ల రెసిడెన్సీలో గల ఫ్లాటు నెం. T-2, 3వ అంతస్థులో గల మొత్తం ఆస్తి చ॥గ॥ 289 లులో అవిభాజ్యపు మరియు అనిర్దిష్ట భాగము చ॥గ॥ 36.12లు ఆస్తికి **హద్దులు: తూర్పు:** MIG Plot No. 118, **దక్షిణం:** 30 Feet Road, **పడమర:** MIG Plot No. 116, **ఉత్తరం:** MIG Plot No. 121.

Boundaries of Flat No. T-2 in Third Floor:
తూర్పు: Open Space, **దక్షిణం:** Entrance and Corridor, **పడమర:** Open Space, **ఉత్తరం:** Open Space.

Visakhapatnam
29.08.2023

A.PRASADA RAO,
I.S.K.SATYA VENI,
A.RAJESH,
G.ALEKYA, Advocates
D.No. 50-50-33/2/1, Beside Gurudwara,
NH-5 Road, Visakhapatnam.
Ph: 9849121666

అభివృద్ధిలో శరవేగం

- 50వ వార్డులో రూ.10 కోట్లతో పనులు
- బీటీ, సీసీ రోడ్లు, కాలువలు, కల్వర్టుల నిర్మాణాలు పూర్తి



తెన్నేటినగర్‌లో కొత్తగా నిర్మించిన బీటీ రోడ్డు



మురళీనగర్‌లో నిర్మించిన ఆరోగ్య కేంద్రం

మద్దిలపాలెం: జీవీఎంసీ 50వ వార్డులో అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది. మాధవధార, మురళీనగర్ ప్రాంతాల్లోని ప్రతి గల్లీలో రహదారుల నిర్మాణం చేపట్టారు. బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం దాదాపు పూర్తయింది. చిన్న చిన్న ప్రాంతాల్లో కల్వర్టులు, కాలువల పనులు జరుగుతున్నాయి. రెండేళ్ల నుంచి ఇప్పటివరకు దాదాపు రూ.10 కోట్ల వార్డు అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. కార్పొరేటర్‌గా వావిలపల్లి ప్రసాద్ ఎన్నికైన నాటి నుంచి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చి ప్రజల మన్ననలు పొందుతూ వార్డును ప్రగతి పథంలో నడిపిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు ప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకుంటూ అభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డారు.

పనుల వివరాలు..

- వార్డు అభివృద్ధి పనుల్లో భాగంగా వంశీనగర్‌లో రూ.40 లక్షలతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ దాదాపు పూర్తయినట్టే.
- ఇదే ప్రాంతంలో రూ.40 లక్షలతో అంగన్‌వాడీ కేంద్రం పనులు మొదలయ్యాయి.
- సాయిరాంనగర్‌లో రూ.40 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు మొదలవ్వాల్సి ఉంది.
- మురళీనగర్, మాధవధార, తెన్నేటినగర్ ప్రాంతాల్లో రహదారులన్నింటినీ ఆధునికీకరించారు.
- సింగరాయికొండ, బాలభాను స్కూల్ రోడ్డు, సాయిరాంనగర్ తదితర ప్రాంతాల్లో కాలువలు, కల్వర్టులు, మెట్ల మార్గాల పనుల పూర్తి చేశారు.
- ఎప్పటి నుంచో మురళీనగర్‌లో కొన్ని చోట్ల పలు రోడ్లు అభివృద్ధికి నోచుకోలేదు. వాటిని కూడా నేడు సరికొత్తగా తీర్చిదిద్దడంతో తళతళ మెరుస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా వార్డులను అభివృద్ధి చేస్తున్నారని వార్డులోని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రారంభానికి సిద్ధంగా ఆరోగ్య కేంద్రం

మురళీనగర్ జీవీఎంసీ ప్రైమరీ స్కూల్ పక్కనే డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మెరుగైన వైద్యం అందాలనే దృక్పథంతో ప్రతి వార్డులోనూ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో వార్డు ప్రజలకు త్వరలోనే ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి రానుంది.

ఆదర్శంగా 50వ వార్డు



జీవీఎంసీ 50వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దేలా అభివృద్ధి చేస్తున్నాం. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ప్రజలు ఎన్నుకుంటారని నమ్మకం ఉంది. వార్డులో ఇప్పటికే దాదాపు రూ.10 కోట్ల పనులు పూర్తయ్యాయి. కొన్ని పనులు జరుగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు చొరవ, సహకారంతో వార్డు అభివృద్ధి సాధ్యమైంది.

– వావిలపల్లి ప్రసాద్, కార్పొరేటర్, 50వ వార్డు

అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, కె.కె.రాజు, అల్ల లీలావతి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ జీవీఎంసీ ప్రైమరీ స్కూల్ సమీపంలో బుధవారం అభివృద్ధి పనులకు మేయర్ గొలగాని హరివెంకటకుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, కె.కె.రాజు, కార్పొరేటర్ అల్ల లీలావతి శ్రీనివాస్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. రూ.1.04 కోట్లతో వార్డులో వివిధ పనులు ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు. రామాలయం నుంచి రైల్వే న్యూకాలనీ బజార్ రోడు, జగన్నాథపురం సాయిబాబా గుడి నుంచి ఆటో స్టాండ్ వరకు, జగన్నాథపురం అంబేడ్కర్ విగ్రహం నుంచి గ్రంధి శ్రీనివాస్ అడ్వకేట్ కార్యాలయం వరకు బీటీ రోడ్లు, కన్నారావు వీధిలో డ్రైనేజీలు, ఎర్రిగెడ్డ దుర్గా గుడి ప్రాంతంలో ఎస్‌డబ్ల్యూ డ్రైనేజీల ఆధునికీకరణ చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్, కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు షరీఫ్, డైరెక్టర్లు ప్రసాదరావు, నాగమణి, డీఈ భరణి, ఏఈ రమణమ్మ, పార్టీ నాయకులు సబ్బి నూకరాజు, కంచు రమణమూర్తి, వెంకటేష్, సూర్యనారాయణ, పిల్లా గణేష్, శివ, ఖాన్, గీతా, గౌరీ, మహాలక్ష్మి, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు, సీవో ధనలక్ష్మి, ఆర్పీలు నాగమణి, అలివేణి, త్రివేణి, జ్యోతి, రజని, పద్మ, వరలక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం



రేసపువానిపాలెంలో కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, కె.కె.రాజు, సాడి పద్మారెడ్డి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలో రూ.20 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని బుధవారం కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి అభివృద్ధి పథంలో విశాఖ దూసుకుపోతోందన్నారు. కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ ఫలాలతోపాటు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. నూతన సచివాలయ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, జోన్–3 కమిషనర్ విజయలక్ష్మి, ఈఈ శ్రీనివాస్, డీఈ శ్రీనివాసరాజు, ఏఈ శ్రీరామ్మూర్తి, మాజీ కార్పొరేటర్ జి.వి.రమణి, సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రూ.60 లక్షలతో అభివృద్ధి పనులు..

రేసపువానిపాలెంలోని పలు కాలనీల్లో రూ.60 లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీలు, రోడ్లు, అదనపు భవన నిర్మాణ పనులకు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, సమన్వయకర్త కె.కె.రాజు శంకుస్థాపన చేశారు.

20 ఏళ్ల సొంతింటి కల సాకారం

సంతోషిమాత కాలనీవాసులకు ఇళ్ల పట్టాల పంపిణీ



కాలనీవాసులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 45వ వార్డు సంతోషిమాత కాలనీ జేఎన్ఎన్‌యూఆర్‌ఎం గృహ సముదాయంలోని 45 కుటుంబాలకు బుధవారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా ఇళ్లలో నివసిస్తున్నా.. పట్టాలు మంజూరు చేయలేదని, విద్యుత్ సదుపాయం, మౌలిక వసతులు కల్పించలేదన్నారు. తమ దృష్టికి సమస్య వచ్చిన వెంటనే అధికారులతో మాట్లాడి ఇళ్ల పట్టాలు ఇచ్చి సంతోషిమాత కాలనీవాసుల సొంతింటి కలను సాకారం చేశామని తెలిపారు. గతంలో మోసపూరిత హామీలిచ్చి అధికారం చేపట్టిన ప్రభుత్వాలు టిడ్కో ఇళ్ల పేరుతో బోగస్ పత్రాలు చేతిలో పెట్టి కాలయాపన చేశాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించిన తరువాత పేదవాడి సొంతింటి కల సాకారం చేయాలనే ఆలోచనకు అనుగుణంగా అన్ని పనులు సత్వరమే పూర్తి చేసి లబ్ధిదారులకు పట్టాలు అందించామన్నారు. సీఎం వైఎస్ జగన్, కె.కె.రాజులకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 45వ వార్డు కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, హౌసింగ్ ఈఈ, ఏఈలు, ఏపీడీ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

డీఆర్‌ఎంతో ఎంపీ జీవీఎల్ భేటీ



డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్‌లోని రైల్వే ప్రయాణికుల సమస్యలను తెలియజేసేందుకు డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్‌తో బుధవారం రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు భేటీ అయ్యారు. జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికైన అనంతరం నూతనంగా డీఆర్‌ఎంను కలిసిన ఆయన పలు సమస్యలను ఆయన తెలియజేశారు. ముఖ్యంగా విశాఖ నుంచి బయలుదేరే పలు రైళ్లలో సాధారణ బోగీల సంఖ్య పెంచాలని, వందే భారత్, దురంతో రైళ్లకు దువ్వాడలో హాల్ట్ ఇవ్వాలని కోరారు. రైల్వే ఆఫీసర్స్ కాలనీ పక్కన గల రైల్వే గ్రౌండ్‌ను ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ కోసం అనుమతించాలని కోరారు. సమావేశంలో ఎంఆర్‌పీఎస్ నాయకుడు శ్రీనివాస్, రైల్వే గ్రౌండ్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు అత్తిలి శంకరరావు, బీజేపీ నాయకురాలు కణితి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కథా కచేరీ



కథ వినిపిస్తున్న మేడా మస్తాన్‌రెడ్డి

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన కథా కచేరీ వైవిధ్యమైన అంశంతో అందరినీ ఆకట్టుకుంది. సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కథలతో మానసిక వికాసం కలుగుతుందన్నారు. రచయితలు తమ కథల ద్వారా మానవాళికి మమత, మానవత్వపు పరిమళం, మానవీయ విలువలు సమాజానికి చాటిచెప్పాలన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ రచయితకు తను చెప్పే విషయంపై నిర్దిష్ట అభిప్రాయం ఉండాలన్నారు. కథలను సమీక్షించారు. రచయిత మేడా మస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ కథకులకు కథలు వినిపించడానికి అవకాశం కల్పించినందుకు సహృదయ సాహితికి ధన్యవాదాలు తెలిపారు. కథా కచేరి ద్వారా ఎందరో రచయితలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అనంతరం రచయితలు కె.వి.ఎస్.మూర్తి, భాగవతుల సత్యనారాయణ మూర్తి, చిన్న సూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, కళ్లేపల్లి స్వర్ణలలిత, మేడా మస్తాన్‌రెడ్డి, రామతాత, కొత్తూరి రమణ, ఆర్.సుబ్బలక్ష్మి తదితరులు కథలు వినిపించారు.

అలరించిన సినీ సంగీత విభావరి



గాయని హర్షితను సత్కరిస్తున్న భూషణ్ బ్రదర్స్

సీతంపేట: భూషణ్ బ్రదర్స్ కల్చరల్ అండ్ ఆర్ట్స్ అసోసియేషన్ 31వ వార్షికోత్సవం సందర్భంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం అభినవ తారావో శీర్షికన నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. ఫణిభూషణ్, యమున, రామకృష్ణ, గిరిజ, కృష్ణంరాజు, రమణి, శశిభూషణ్, సుజాత, ఉమాభూషణ్, జ్యోతి, వెంకట్, హర్షిణి, భూపతిరావులు పాడిన చిత్ర గీతాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. పాడుతా తీయగా కార్యక్రమంలో పాటలు పాడిన బంకపల్లి హర్షిత, దుబాయ్‌లో జరిగిన బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన గోకా రామకృష్ణలను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశాఖ సకల కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు, వికసం మాజీ చైర్మన్ కొణతాల రాజు, న్యాయవాది ఎస్.ఎస్.ఎన్.రాజు, ఆధ్యాత్మిక వేత్త ఫణిస్వామి, రాధారాణి పాల్గొన్నారు.

ప్రైమ్ 2.0 విధానం వద్దు



అక్కయ్యపాలెం రిజిస్టర్ ఆఫీస్ వద్ద నిరసన తెలుపుతున్న డాక్యుమెంట్ రైటర్లు

సీతంపేట: ప్రభుత్వం తక్షణమే ప్రైమ్ 2.0 యాప్‌ను వెనక్కి తీసుకుని గతంలో ఉన్న రిజిస్ట్రేషన్ పద్ధతినే కొనసాగించాలని డాక్యుమెంట్ రైటర్లు డిమాండ్ చేశారు. ప్రైమ్ 2.0 యాప్‌ను వినియోగించరాదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంఘం పిలుపు మేరకు బుధవారం డాక్యుమెంట్ రైటర్లు అక్కయ్యపాలెం రిజిస్టర్ ఆఫీస్ వద్ద ధర్నా చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ప్రైమ్ 2.0 యాప్ వల్ల ప్రజలకు అనేక రకాల ఇబ్బందులు వాటిల్లే పరిస్థితి ఉందన్నారు. దస్తావేజులు ఆన్‌లైన్‌లో తయారు చేసి పెడితే వచ్చే లోపాలకు అనేక సార్లు రిజిస్టర్ ఆఫీస్‌కు వెళ్లి సవరణలు చేసుకోవాల్సి వస్తుందన్నారు. దీని వల్ల ప్రజలకు అసౌకర్యం కలుగుతుందని, పాతపద్ధతినే కొనసాగించాలని కోరారు. వీరికి ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో డాక్యుమెంట్స్ రైటర్లు పెదగోపు రంగారావు, వడ్లమాని వెంకటరమణ, మల్లువలస నరసింహారావు, పి.ఏకాంభరం, కాయల శ్రీనివాసరావు, బండారు గీతాప్రసాద్, బి.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుపై విష్ణుకుమార్‌రాజు వ్యాఖ్యలు అవాస్తవం

బహిరంగ చర్చకు సవాల్ విసిరిన కె.కె.రాజు



మాట్లాడుతున్న కె.కె.రాజు

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గానికి సంబంధించి ఓటర్ల నమోదుపై బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. దీనిపై అధికారులు, మీడియా సమక్షంలో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం మీడియాతో కె.కె.రాజు మాట్లాడుతూ 66 పోలింగ్ బూత్‌లో నిర్వహించిన సర్వేలో 66,363 ఓట్లకుగానూ 15,516 బోగస్ ఓట్లు చేర్పించారని విష్ణుకుమార్‌రాజు చెప్పిన మాటలు పూర్తిగా అవాస్తవమన్నారు. ఆయన బీజేపీ కండువా వేసుకొని చంద్రబాబు, లోకేశ్‌లు ఇచ్చిన స్క్రిప్ట్ మేరకు మాట్లాడుతున్నారని విమర్శించారు. 2014 నుంచి 2019 వరకు ఉత్తర నియోజకవర్గంలో ఆయన పంపిణీ చేసిన 18 వేల ఇళ్ల పట్టాలన్నీ తప్పుడవి పేర్కొన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో సుమారు 4,500 ఇళ్ల నిర్మాణంలో విష్ణుకుమార్‌రాజు కాంట్రాక్ట్ పొందారని గుర్తుచేశారు. ఏఎస్సార్ నగర్, సంతోషిమాత కాలనీల్లో ఒక్క ఇల్లు కూడా కట్టిన దాఖలాలు లేవని, చివరికి 2019 ఎన్నికల్లో ఇళ్లు ఇస్తామని చెప్పి ఒక పేపర్ మీద సంతకం పెట్టి మొండిచేయి చూపారన్నారు. ఆయన చేపట్టిన సర్వేలో 15,516 ఓట్లు బోగస్ అని చెప్పడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. ప్రభుత్వంపై దుష్ప్రచారం ఆపి.. నీతి నిజాయితీలతో కూడిన రాజకీయం చేయాలని హితవు పలికారు. పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

తెలుగు ఉపాధ్యాయిని హైమావతికి సత్కారం



ఉపాధ్యాయిని హైమావతిని సత్కరిస్తున్న కె.కె రాజు, వావిలపల్లి ప్రసాద్

మురళీనగర్: తెలుగు భాషకు ఉపాధ్యాయిని హైమావతి చేసిన సేవలకు గానూ గిడుగు అవార్డు వరించడం హర్షణీయమని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. తెలుగు వ్యవహారిక భాష పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా రాష్ట్ర అధికార భాషా సంఘం తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ నిర్వహించిన తెలుగు భాష వికాస వారోత్సవాలకు మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని ఎ.హైమావతిని ప్రత్యేకంగా ఆహ్వానించి ఈ నెల 29న విజయవాడ తుమ్మపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆమెను సత్కరించిన విషయం విదితమే. ఈ సందర్భంగా బుధవారం మాధవధార హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథి కె.కె.రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సేవలకు ప్రభుత్వ గుర్తింపు ఎప్పుడూ ఉంటుందన్నారు. హైమావతిని కె.కె రాజు, 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పేడాడ రమణికుమారి, పైడి శ్రీను, పి.సునీత, కృష్ణారావు మాస్టర్, అమర్ రెడ్డి, అప్పారావు మాస్టర్, నాయుడు మాస్టర్, సీపాన రాము, రాంమోహన్, సబ్బవరపు శ్రీను, సోని, సరస, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబకు ప్రధాన అర్చకుడు శ్రీనివాసరావు, భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు నీళ్లతో అమ్మవారికి భక్తులు జలాభిషేకం చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మురళీనగర్: మద్దిలపాలెం సెక్షన్ పరిధి ఎఫ్‌సీఐ 11 కేవీ ఫీడర్‌లో నిర్వహణ పనుల నిమిత్తం సెప్టెంబర్ 1న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు భాస్కర్ గార్డెన్స్, ఎఫ్‌సీఐ పార్కు, శివనగర్, రామాలయం వీధి ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన సూచించారు.



క్రేన్ ఢీకొని బీటెక్ విద్యార్థికి గాయాలు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో బస్టాప్ వద్ద అదే కాలేజీకి చెందిన బీటెక్ సెకండియర్ విద్యార్థి టి.వివేక్ ఆనంద్‌ను మంగళవారం సాయంత్రం క్రేన్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. నగరంలోని కేఆర్‌ఎం కాలనీకి చెందిన వివేక్ ఆనంద్ కళాశాల విడిచిపెట్టిన తరువాత ఇంటికి వెళ్లే క్రమంలో బస్సు కోసం స్టాప్ వద్ద నిల్చున్నాడు. అదే సమయంలో విజయనగరం నుంచి విశాఖ వైపు వేగంగా నిర్లక్ష్యంగా వచ్చిన క్రేన్ విద్యార్థిని ఢీకొనడంతో ఛాతీ, పొట్టపై తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే అతడి స్నేహితులు సంగివలస అనిల్ నీరుకొండ జనరల్ ఆస్పత్రిలో చికిత్సకు తరలించారు. క్షతగాత్రుడి తండ్రి ప్రభాకర్‌రావు ఫిర్యాదు మేరకు భీమిలి ఎస్‌ఐ గంటా హరీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుబంధాలకు ప్రతీక రాఖీ



కె.కె.రాజుకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీస్ ప్రతినిధి రమా



ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్‌కు రాఖీ కడుతున్న స్కూల్ పిల్లలు



పాలిటెక్నిక్ కాలేజీలో లెక్చరర్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి

సీతమ్మధార: అనుబంధాలకు ప్రతీకైన రాఖీ పండగను బుధవారం పలువురు ఘనంగా నిర్వహించారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజుకు బ్రహ్మకుమారీస్ ప్రతినిధి రమా రాఖీ కట్టి, స్వీట్ తినిపించారు.

సీఐకి రాఖీ కట్టిన చిన్నారులు ..

ఫోర్త్‌టౌన్ సీఐ ఎస్.విజయకుమార్‌కు ప్రైవేట్ స్కూల్ చిన్నారి విద్యార్థినులు రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించారు. రాఖీ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అన్నదమ్ములకు అక్కచెల్లెమ్మలు రాఖీలు కట్టి వారి అనుబంధాన్ని పంచుకుంటారన్నారు. స్కూల్ పిల్లలు తనకు రాఖీ కట్టడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం పిల్లలకు సీఐ చాక్లెట్లు పంచిపెట్టారు. ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ అప్పలరాజుకు పిల్లలు రాఖీ కట్టారు. ఫోర్త్‌టౌన్, ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ సిబ్బందికి రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు.

పాలిటెక్నిక్ కాలేజీలో రాఖీ పండగ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో మురళీనగర్ బ్రహ్మకుమారీ సంస్థ ఆధ్వర్యంలో రాఖీ పండగ నిర్వహించారు. అన్నాచెల్లెళ్ల ప్రేమానురాగాలకు ప్రతీకగా రాఖీ పండగ నిలుస్తుందని కాలేజీ ప్రిన్సిపాల్ కె.డి.వి.నరసింహారావు అన్నారు. లెక్చరర్లకు బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.